నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ ఆదివారం 21-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:110 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం- నేటికి అందం**

ఆడుచు మహోన్నతంబుగ
పాడుచు జయగీతికతతి భారత జట్టే
ఓడించి యాఫ్రికనులను
మూడుగ నొకటిగను నిలచి ముద మందించెన్ !!

(ట్వంటీ ట్వంటీ 5 సిరీస్ లో భారత దేశం సౌత్ ఆఫ్రికా మీద 3-1 గా విజయం సాధించి సిరీస్ ను కైవశం చేసుకున్నది.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

పంచాయితీ ఎన్నికల్లో
పైకెగిరిన బీసీ జెండా
రిజర్వేషన్ పెంచకున్నా
రాష్ట్రంలో ప్రజల అండ
కోటపెంపు పైన కేంద్ర
కట్టడి సంకెళ్ల సెగ
ఐనా వాళ్ల ఎదుగుదల
ఆపలేని దాని పొగ



-వేల్పుల నారాయణ
9440433475

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనలు...

హైదరాబాద్, డిసెంబర్ 20: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ద్రౌపది ముర్ము నిన్ననే నగరానికి రాగా.. ఈరోజు(శనివారం) సీపీ రాధాకృష్ణన్ చేరుకున్నారు. ఇవాళ మధ్యాహ్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా.. మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నేడు జరిగే పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల ముగింపు సదస్సులో ఉప రాష్ట్రపతి పాల్గొనున్నారు. మరోవైపు శీతాకాల విడిది కోసం వచ్చిన రాష్ట్రపతి.. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిన్న జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన (పీఎస్సీ) ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈరోజు గచ్చిబౌలిలో బ్రహ్మ కుమారిస్ శాంతి సర్వోవర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకి ఘనస్వాగతం పలికారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. కాగా, రెండ్రోజుల పర్యటన సందర్భంగా నేడు హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి.. నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్‌పర్సన్ల సమావేశ ముగింపు సెషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాజ్‌భవన్‌కి వెళ్లి రాత్రికి అక్కడే బస చేయనున్నారు.

ఆదివారం ఉదయం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కన్హా శాంతి వనంలో నిర్వహించే వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమానికి ఆయన హాజరవుతారు. అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేరుగా ఢిల్లీకి బయలుదేరుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో తెలంగాణ, హైదరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలి : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బెంగాల్‌లో ఆయన పర్యటించారు. పశ్చిమ బెంగాల్‌లోని తాహెర్‌పూర్‌కు వెళ్లారు. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ల్యాండింగ్ సాధ్యం కాలేదు. కొంతసేపు హెలిప్యాడ్‌పై చక్కర్లు కొట్టి కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ప్రధాని విమానాశ్రయం నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బంకిం చంద్ర ఛటర్జీకి నివాళులర్పించారు. వందేమాతరం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మంత్రమని, వందేమాతరాన్ని దేశ నిర్మాణానికి మంత్రంగా మార్చాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం దేశ పౌరులతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. జీఎస్టీ బెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉపశమనం ఇచ్చిందని, దుర్గాపూజ, ఇతర పండుగల సమయంలో దేశవ్యాప్తంగా ప్రజల చాలా ప్రయోజనం పొందారన్నారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ నుంచి రక్షణ లభిస్తోందని ఆరోపించారు. గంగానది బీహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుందని, బీహార్ బెంగాల్‌కు మార్గం చూపిందని పేర్కొన్నారు. బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలని పిలుపునిచ్చారు. తాను బెంగాల్ ప్రజలకు మనస్ఫూర్తిగా అంకితమయ్యానని, రాష్ట్రానికి నిధుల కొరత లేదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్న ఆయన.. బీజేపీని వ్యతిరేకించాలనుకుంటే టీఎంసీ వ్యతిరేకించవచ్చని, రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవడం అర్థరహితమన్నారు.

బీజేపీకి ఒక అవకాశం ఇచ్చి, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూ.3200 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించారు. నదియా జిల్లాలోని జాతీయ రహదారి-34లోని బర్జగులి-కృష్ణానగర్ సెక్షన్‌కు చెందిన 66.7 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల రహదారిని ప్రారంభించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బరాసత్-బర్జగులి సెక్షన్‌కు చెందిన 17.6 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల రహదారికి శంకుస్థాపన చేశారు.

# అనుమానాస్పద కాల్స్ వస్తే 1930కి కాల్ చేయండి : సీపీ సజ్జనార్

హైదరాబాద్, డిసెంబర్ 20: ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనాం అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైడ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయండి. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం. మధుర నగర్ పోలీస్ స్టేషన్ ను త్వరలోనే ప్రజలకి అనువుగా అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేస్తాం' అని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో సిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలు తెలియజేస్తామని సజ్జనార్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి సిట్ కార్యాలయం విషయంలో ఆలోచన చేస్తున్నామని, ప్రస్తుతం జూబ్లీహిల్స్ పీఎస్ లోనే ఫోన్ ట్యాపింగ్ సంబంధించి విచారణ సాగుతుందని తెలిపారు. మరోవైపు ఐ బొమ్మ రవి కేసు గురించి అడిషనల్ సీపీ శ్రీనివాస్ పలు విషయాలను వెల్లడించారు. 'ఐ బొమ్మ రవి విచారణ జరుగుతుంది. సమాధానాలు చెప్పడంలేదని బయట ఊహాగానాలు వస్తున్నాయి. మా స్టైల్ లో వేము విచారణ చేస్తున్నాము.

# అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించిన సీఎం..

హైదరాబాద్, డిసెంబర్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అజ్మీర్ షరీఫ్ దర్గాకు పవిత్రమైన చాదర్‌ను సమర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో? హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ 814వ ఉర్సు వేడుకలను పురస్కరించుకుని ఆయన చాదర్‌ను అందజేశారు. అజ్మీర్ దర్గాను ఆధ్యాత్మికత, సామాజిక సామరస్యం, సోదరభావానికి చిహ్నంగా అభివర్ణించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, మతసామరస్యం వర్ధిల్లాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ఈ వేడుకలో పాల్గొన్న మైనార్టీ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 'సెక్యులర్ సీఎం'గా కొనియాడుతూ, ఆయన అన్ని మతాలను సమానంగా గౌరవిస్తారని ప్రశంసించారు. ప్రతి ఏటా అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించే సంప్రదాయాన్ని ఆయన



కొనసాగిస్తున్నారని, ముఖ్యంగా తెలంగాణ నుండి వెళ్లే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అజ్మీర్‌లో 'రుబాత్'ను నిర్మించిందని వారు గుర్తుచేశారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ చర్యలు నిదర్శనమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మెడికల్ కాలేజీల పనితీరుపై నివేదిక ఇవ్వాల్సిందే.. మంత్రి కీలక ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 20:రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతే కాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**- రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20:నేటినిజం (ప్రతినిధి): రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారుల, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖా అధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్బంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేవారని, గత ఏడాది నుంచి మాసోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదాల్లో 18 నుంచి 20 మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. గత ఏడాది 7,949 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై ఈ నెల ఆఖరులోగా జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహణ పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నేషనల్ హై వే, ఆర్ అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా జిల్లాలోని బ్లాక్ స్పాట్లను గుర్తించాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రత మాసోత్సవాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని, నెల రోజులపాటు ట్రాఫిక్ వాలంటీర్లను నియమించాలని సూచించారు. అనంతరం వారిని అభినందిస్తూ సర్టిఫికెట్ అందించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం అందించాలని సుప్రీంకోర్ట్ ఆదేశాలు జారీ చేసిందని, రోడ్డు ప్రమాద బాధితుల వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, క్షతగాత్రులను ఆసుపత్రికి




తరలించిన వారికి పారితోషికం ఇస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలోని రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు చేపడుతామని పేర్కొన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చిస్తామని వివరించారు. నేషనల్ హై వే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖా అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, బ్లాక్ స్పాట్లు గుర్తిస్తామని, వాటి పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా రవాణా శాఖా అధికారి లక్ష్మణ్, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, పీఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, ఆర్అండ్ బీ డీఈ శాంతయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, జిల్లా వైద్యాధికారి రజిత, విద్య శాఖా అధికారులు, ట్రాఫిక్ పోలీస్ లు తదితరులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొట్టడంతో ఎనిమిది ఏనుగులు మృతి.. పట్టాలు తప్పిన ఐదు బోగీలు

అస్సాం (దిస్‌పూర్) డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏనుగులను ఢీకొట్టి అనంతరం రైలు పట్టాలు తప్పింది. ఈ సంఘటన అస్సాం రాష్ట్రం నాగావ్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున జరిగింది. రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ వెళ్తుండగా జమున్ ముఖ కాన్పూర్ ప్రాంతంలోని ఎనిమిది ఏనుగులు రైల్వే ట్రాక్ లపైకి వచ్చాయి. రైలు ఢీకొట్టడంతో ఎనిమిది ఏనుగులు ఘటనా స్థలంలోనే చనిపోయాయి. ఈ ప్రమాదంలో ఐదు బోగీలు పట్టాలు తప్పినట్టు అధి కారులు పేర్కొన్నారు. గౌహతికి 126 కిలో మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. రైల్వే పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు.

# పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరి: డిప్యూటీ సీఎం భట్టి..



హైదరాబాద్, డిసెంబర్ 20:పబ్లిక్ సర్వీస్ కమిషన్లుదేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు.

ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

## బీజేపీలో చేరిన సీనియర్ నటి ఆమని

హైదరాబాద్ డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టాలీవుడ్ సీనియర్ నటి ఆమని రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించింది. శనివారం ఆమె అధికారికంగా భారతీయ జనతా పార్టీ లో చేరింది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ఆమని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాంచందర్ రావు ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆమనీతో పాటు ప్రముఖ సినీ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా ఇదే వేదికపై కాషాయ గూటికి చేరారు. పార్టీలో చేరిన తర్వాత ఆమని మీడియాతో మాట్లాడుతూ.. తన మనసులోని మాటను పంచుకున్నారు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా గర్వించదగ్గ స్థాయికి చేరుకుంది. భారతీయురాలిగా గర్వపడేలా చేసిన ఆయన అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకున్నాను అని ఆమని తెలిపారు. మోదీ ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఆమె పేర్కొన్నారు.

# భారత్‌లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు

**-యువ డాక్టర్లకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా హితవు**

లక్నో డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విదేశాలకు వెళ్లాలనుకుంటున్న యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదు అని మంత్రి నడ్డా పేర్కొన్నారు. లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే యువ డాక్టర్లు స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని, కానీ భారత్‌లో సదుపాయాలు లేవని నిందలు చేయవద్దు అన్నారు. ఇక్కడ ఉన్న సంస్థలను, సదుపాయాల్ని వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.



# తెలుగు మహిళామణుల అభిమానాన్ని చూరగొన్న చీర కట్టు

## (21 డిసెంబర్ "అంతర్జాతీయ చీరల దినోత్సవం" సందర్భంగా)

అనాదిగా భారత ఉపఖండ సాంస్కృతిక వారసత్వానికి, నేతన్నల హస్తకళా నైపుణ్య వికాసానికి పెట్టింది పేరు మహిళలు ధరించే సప్తవర్ణాల చీర. ఎలాంటి కుట్లు లేకుండా పొడవైన పలు అద్భుత డిజైన్లతో చీరను మహిళలు నడుం చుట్టు ధరించి, కొంగును భుజాన వేసుకొని చక్కటి సింగులతో కాళ్ల వరకు వేలాడే విధంగా బొడ్లో చెక్కుకుని, శరీరానికి హత్తుకునే విధంగా జాకెట్ ధరించి మహిళల అందాలను ద్విగుణీకృతం చేసే చీర మన భారతీయతకు మరుపురాని చిహ్నం. చీర కట్టు, నుదుటిన బొట్టు, కళ్లకు కాటుకతో భారతీయత ఉట్టిపడే సనాతన సాంప్రదాయం మన స్త్రీ సమాజానికే వన్నె తెచ్చి పెడుతున్నది.

### చీర కట్టు పరిణామ క్రమం:

ఇండస్ వ్యాలీ సంస్కృతిగా క్రీస్తుకు పూర్వం 2,800 – 1,800 కాలంలో ప్రారంభంపైన చీర కట్టు నేటికీ అంతే ఆదరణను కలిగి ఉంటున్నది. నవ్య చీరల రూపం క్రీ పూ 300ల్లో రావటం, క్రీ శ 1200ల్లో చీరలు నేత సంబంధిత పరిశ్రమలు ఏర్పడడం, బ్రిటీష్ పాలన సమయంలో 1600–1940ల్లో చీరలకు ఆధునిక రూపం ఇవ్వడం, 1950ల్లో సినిమాల ద్వారా చీర కట్టు ప్రచారం కావడం, 2015 నుంచి "అంతర్జాతీయ చీరల దినోత్సవం (ఇంటర్నేషనల్ సారీ డే)" నిర్వహించుకోవడం జరుగుతోంది. మహిళలు చీరలను దాదాపు 80 రకాలుగా ధరించడం గమనిస్తున్నాం. ఇండియాతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ లాంటి దేశాల్లో చీరలను ధరించడం మన మహిళలకు అలవాటుగా మారింది.

### తెలుగింటి స్త్రీల చిరునామా అందమైన చీరకట్టు:

చీర కట్టులో మహిళలు అందంగా కనిపించడం, చీరలు స్త్రీ సమాజ చిహ్నాలుగా మారడం గమనిస్తున్న ప్రపంచ మానవాళి ప్రతి ఏట 21 డిసెంబర్‌న "అంతర్జాతీయ చీరల దినోత్సవం (ఇంటర్నేషనల్ సారీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ఆధునిక డిజిటల్ యుగంలో చక్కటి అంచుల రంగులు/డిజైన్‌లో తో ఆర్గాంజా చీరలు, బోల్డ్ నియాన్ చీరలు, బెనారస్ చీరలు, బార్డర్‌లెస్ చీరలు, టిష్యూ చీరలు, పస్టెల్ సెక్విన్ చీరలు, 3డి బొమ్మలు కలిగిన చీరలు, టస్సెర్ చీరలు, ఇక్కత్ చీరలు, చందేరీ చీరలు, పైథాన్ చీరలు, పటోలా చీరలు, భుజ్ బంధనీ చీరలు, మెటాలిక్ చీరలు, జిమ్మీ ఛూ చీరలు, వెల్వెట్ చీరలు లాంటి డిజైనర్ సారీస్‌ను మహిళలు మక్కువతో ధరించడం చూస్తున్నాం. ఏపీలోని వెంకటగిరి పట్టణం చేనేత వస్త్ర నైపుణ్యాలకు వెంకటగిరి సిల్క్ చీరలు ప్రసిద్ధి చెందినవి. అదే విధంగా తెలుగు రాష్ట్రాల మహిళల మన్ననలు పొందిన చీరల్లో ఉప్పాడ పట్టు, పోచంపల్లి, గద్వాల్, కంచి కలంకారి, ఇక్కత్, ధర్మవం, హాండ్ ప్రింట్, మైసూర్ సిల్క్, చెట్టినాడ్, కసవు, మంగళగిరి, కంచీవరం లాంటి అనేక రకాలు ఉన్నాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా "ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి, సాంస్కృతిక పరిరక్షణ"లో భాగంగా మన వస్త్రాలంకరణల సంరక్షణకు పెద్ద పీట వేయడం జరిగింది. అందమైన, ఆకర్షణీయమైన డిజైన్లతో చీరల ఉత్పత్తులు కొత్త పుంతలు తొక్కడానికి కారణమైన నేతన్నల హస్తకళా నైపుణ్యాలను ప్రశంసిస్తూ, చీర కట్టు ఆచారాన్ని కొనసాగిస్తూ, మహిళలు/బాలికలు మనదైన చీర కట్టుకు పట్టం కట్టి తమ సౌందర్యాలను పలు రెట్లు పెంచుకోవాలని కోరుకుందాం, గౌరవానికి ప్రతీకలుగా చీర కట్టును ప్రోత్సహిద్దాం.

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# హైదరాబాద్ రాష్ట్రపతి నిలయంలో రెండో ఉద్యాన ఉత్సవాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి




హైదరాబాద్, డిసెంబర్ 20:హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో రెండో ఉద్యాన ఉత్సవాన్ని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు ప్రారంభించారు. భారత హరిత సంప్రదాయాలు, సుస్థిర పద్ధతులు, సామాజిక భాగస్వామ్యాన్ని చాటే ఈ తొమ్మిది రోజుల వ్యవసాయ, ఉద్యాన ఉత్సవం జనవరి 3, 2026 నుంచి 11వ తేదీ వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

జనవరి 2025లో జరిగిన మొదటి ఉద్యాన ఉత్సవానికి కొనసాగింపుగా ఈ ఏడాది రెండవ సంచికను నిర్వహిస్తున్నారు. మొదటిసారి ఉత్సవం జరిగిన 12 రోజుల్లో 1.3 లక్షల మంది సందర్శకుల హాజరుతో విశేష స్పందన వచ్చింది. ప్రారంభ ఉత్సవ విజయాన్ని ఆధారంగా చేసుకొని, ఉద్యాన్ ఉత్సవ్ 2026 సుస్థిర వ్యవసాయం, ఉద్యాన పరిశ్రమ, పర్యావరణపరంగా బాధ్యతాయుత జీవనశైలి గురించి ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రెండో ఉద్యాన ఉత్సవం జనవరి 3 నుంచి జనవరి 11, 2026 వరకు రాష్ట్రపతి నిలయం ప్రధాన ప్రాంగణంలో జరుగుతుంది.

ఉదయం 10:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు సందర్శన సమయం కాగా, చివరిగా రాత్రి 7:00 గంటలకు సందర్శకులను లోపలికి అనుమతిస్తారు. ఉత్సవానికి సందర్శకులను ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా రెండో నెంబర్ గేటు ద్వారా లోనికి అనుమతిస్తారు.

వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ – ఎంఏఎన్ఏజీఈ) ముఖ్య విజ్ఞాన భాగస్వామిగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

సందర్శకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన సందర్శన అనుభవాన్ని అందించడానికి రాష్ట్రపతి నిలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులో భద్రతా నిర్వహణ, పారిశుద్ధ్య సేవలు, తాగునీటి కేంద్రాలు, ప్రథమ చికిత్స సౌకర్యాలు, ఎలక్ట్రిక్ కార్ట్‌లు, ఉత్సవ రోజుల్లో ఉద్యాన ప్రాంగణం రోజువారీ నిర్వహణ వంటివి ఉన్నాయి.

ఉద్యాన్ ఉత్సవ్ 2026 సందర్భంగా రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి, ప్రకృతి, వ్యవసాయం, సంస్కృతుల గొప్ప సమ్మేళనాన్ని అనుభవించాలని రాష్ట్రపతి పౌరులను ఆహ్వానిస్తున్నారు.

# చిన్న ఆలోచనలతో అభివృద్ధికి మార్గాలు

**–నిధుల్లేకుండా పథకాలు అమలు చేయొచ్చు**
**–రాష్ట్ర వ్యాప్తంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు**
**–తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులతో సీఎం ఇంటరాక్షన్**
**–పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ చొరవను అభినందించిన సీఎం**



అనకాపల్లి, డిసెంబర్ 20: చిన్న చిన్న ఆలోచనలు ఒక్కో సందర్భంలో అభివృద్ధికి బాటలు వేస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను స్వయంగా సీఎం పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపొందిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని తాళ్లపాలెం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా ప్రారంభిస్తున్నానని ముఖ్యమంత్రి తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థినులతో ముఖ్యమంత్రి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రతను, ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ఈ కార్యక్రమం చేపట్టాం. పాఠశాలకు చక్కటి యూనిఫాంతో, పరిశుభ్రంగా చదువుకోవాలి. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ముస్తాబు కార్యక్రమం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ తరహా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో శ్రద్ధ వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 75 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ వరకూ చదువుతున్నారు. ముస్తాబు లాంటి కార్యక్రమం వల్ల వ్యక్తిగత శుభ్రతతో పాటు నాయకత్వ లక్షణాలు కూడా వస్తాయి. చక్కగా తలదువ్వుకోవటం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవటం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. డబ్బులను ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండానే ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. విద్యార్థులందరికీ మంచి భవిష్యత్తు రావాలని కోరుతున్నాను. తల్లితండ్రులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థుల పైనే ఆశలు పెట్టుకుంది. అందరికీ తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందించాం. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, భోజనం అన్నీ ఉచితంగానే ఇస్తున్నాం. జీవితంలో ఏం సాధించాలన్నా చిన్న వయస్సు నుంచే కృషి చేయాలి. విద్యార్థులంతా రాష్ట్రానికి చెందిన ఆస్తి. విద్యార్థులు నాలెడ్జి ఎకానమీలో భాగం కావాలి. మంచి ఉపాధి, ఉద్యోగాల్లో విద్యార్థులంతా రాణించాలని ఆకాంక్షిస్తున్నాను. రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్యాన్ని కూడా త్వరలోనే పరీక్షిస్తాం. విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉండేలా మంచి పౌష్టికాహారం ఇస్తున్నాం. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్య శాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకువస్తున్నారు." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లాకు ప్రతినిధులు, పాల్గొన్నారు.

# 18వ లోక్ సభ ఆరవ సమావేశాల్లో 111 శాతం ఉత్పాదకత నమోదు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: డిసెంబర్ 1న ప్రారంభమైన పద్దెనిమిదవ లోక్ సభ ఆరవ సమావేశాలు నేటితో ముగిశాయి.

మొత్తం 15 సార్లు లోక్‌సభ సమావేశమైందని స్పీకర్ శ్రీ ఓం బిర్లా వెల్లడించారు. 92 గంటల 25 నిమిషాల పాటు సమావేశాలు కొనసాగినట్లు తెలిపారు.

డిసెంబర్ 15న 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత అనుబంధ నిధుల డిమాండ్లపై చర్చ అనంతరం ఓటింగ్ జరిగింది. ఆ తర్వాత అప్రోప్రియేషన్ (నెంబర్ 4) బిల్లు 2025కు ఆమోదం లభించింది.

డిసెంబర్ 8న జాతీయ గీతం "వందేమాతరం" 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి దీనిపై చర్చను ప్రారంభించారు. ఈ అంశంపై 11 గంటల 32 నిమిషాల పాటు చర్చ జరిగింది. ఇందులో 65 మంది సభ్యులు పాల్గొన్నారు. దీంతోపాటు డిసెంబర్ 9, 10 తేదీల్లో "ఎన్నికల సంస్కరణలు" అంశంపై సుమారు 13 గంటల పాటు చర్చ జరిగింది. ఇందులో 63 మంది సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నలకు మంత్రులు మౌఖికంగా సమాధానం ఇచ్చారు. అదేవిధంగా 3449 నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు స్వీకరించారు.

జీరో అవర్ సమయంలో సభ్యులు మొత్తం 408 అత్యవసర ప్రజా ప్రాముఖ్యత గల విషయాలను లేవనెత్తారు. రూల్ 377 కింద మొత్తం 372 విషయాలు చర్చకు స్వీకరించారు. డిసెంబర్ 11న సభలో జీరో అవర్‌లో 150 మంది సభ్యులు తమ అంశాలను ప్రతిపాదించారు.

సమావేశాల్లో డైరెక్షన్ 73ఏ కింద 35 ప్రకటనలు ఇవ్వగా.. మొత్తం 38 ప్రకటనలు వచ్చాయి. వీటిలో రెండు నియమాలు 372 కింద, ఒకటి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రివర్గం ద్వారా వచ్చినవి ఉన్నాయి.

ఈ సమావేశాల్లో మొత్తం 2,116 పత్రాలను సభ ముందు ఉంచారు. వివిధ శాఖలకు సంబంధించిన 41 పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నివేదికలను సభలో ప్రవేశపెట్టారు.

సమావేశాల సందర్భంగా డిసెంబర్ 5న వివిధ అంశాలపై 137 ప్రైవేటు సభ్యుల బిల్లులు ప్రవేశపెట్టారు. 12న శ్రీ షఫీ పరంబిల్ ప్రవేశపెట్టిన ఒక ప్రైవేటు సభ్యుల తీర్మానంపై చర్చల అనంతరం సభ అనుమతితో దానిని ఉపసంహరించుకున్నారు. డిసెంబర్ 2న జార్జియా పార్లమెంటు చైర్మన్ శ్రీ షాల్వా పాపుయాష్విలి నేతృత్వంలోని పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి భారత పార్లమెంట్ ఘనస్వాగతం పలికింది.






# హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ

**–ద్విచక్ర వాహనదారులతో ముఖాముఖి చర్చ**
**–హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించిన పోలీసులు**
**–ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ**
**–చట్టం కంటే ముందే ప్రాణభద్రతకు ప్రాధాన్యం**



అమరావతి, డిసెంబర్ 20:విజయవాడ నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆలోచనల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షేక్ షరీన్ బేగం సూచనలతో, ట్రాఫిక్ సీఐ కే. కిషోర్ బాబు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధారణ ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ (ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి, ముత్యాలంపాడు రోడ్డులోని ఒక కళ్యాణ మండప సమావేశ మందిరానికి ఆహ్వానించారు. అక్కడ వాహనదారులతో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తూ హెల్మెట్ లేకుండా వాహనం నడపడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కొద్ది దూరమే ప్రయాణం చేస్తున్నామని, అసౌకర్యంగా ఉంటుందని, తొందరలో ఉన్నామని వంటి చిన్నచిన్న కారణాలతో హెల్మెట్ ధరించలేదని పలువురు వాహనదారులు తెలిపారు. అయితే ఇవి ప్రాణాల కంటే పెద్ద కారణాలు కాదని, ప్రమాదం ఎప్పుడు ఎక్కడ జరుగుతుందో ఎవరికీ తెలియదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ చర్చల అనంతరం వాహనదారులందరూ హెల్మెట్ ధారణ అత్యంత అవసరమని అంగీకరించారు.

ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతామని, తమ కుటుంబాల భద్రత కోసం ఈ నియమాన్ని కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. అలాగే తమతో పాటు ఇతర వాహనదారులకు కూడా హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రైటర్ అజహర్, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, జకీర్, బాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలను వనరులుగా మారుద్దాం..

**–స్వచ్ఛ సర్వేక్షణలో ముందుందాం..**
**–స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ**



అమరావతి, డిసెంబర్ 20:వ్యర్థాలను సరైన ఆలోచన, కార్యాచరణతో విలువైన వనరులుగా మార్చడం ద్వారా సర్క్యులర్ ఎకానమితో ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణ పరంగా బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

డిసెంబర్ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా నందిగామ మునిసిపాలిటీ పరిధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసే ఉద్దేశంతో ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల పర్యావరణంలో అవకాశాలు–సర్క్యులర్ ఎకానమి ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం ద్వారా సర్క్యులర్ ఎకానమికి బాటలు వేయొచ్చని.. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ద్వారా వస్తున్న ఫలితాలు ఇందుకు ఉదాహరణలు అని తెలిపారు.

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషి చేయాల్సిన అవసరముందని.. ప్రకృతి వ్యవసాయం, జల వనరుల సంరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండటం తదితరాల వల్ల భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించేందుకు వీలవుతుందన్నారు. 33 శాతం హరిత విస్తీర్ణం ఉండాలని, అయితే జిల్లాలో ఇది 25 శాతం ఉండాలని, ఇందుకోసం గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులకు కృషిచేయాలి

పారిశుధ్యం, హరిత విస్తీర్ణం పెంపు, ప్రజల భాగస్వామ్యం, శుద్ధ ఇంధన వినియోగం, పరిశుభ్రమైన రహదారులు ఇలా వివిధ అంశాల్లో మెరుగైన ప్రగతి ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల సాధనకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని సరైన విధంగా అర్థం చేసుకొని ముందడుగు వేయాలన్నారు.

వినూత్న ఆలోచనల ద్వారా పరిసరాలు, నివాసాల ద్వారా ఉత్పన్నమయ్యే వ్యర్థాలను వనరులుగా ఉపయోగించుకుంటూ స్వయం ఉపాధి, వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవచ్చుని వివరించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వడం వల్ల, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తే

**కలిగే ప్రయోజనాలను వివరించారు.**

కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను కలెక్టర్ లక్ష్మీశ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సత్కరించారు. ప్లాస్టిక్ భూతంపై చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకోగా.. చిన్నారులను కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, మునిసిపల్ కమిషనర్ లోవరాజు, మెప్మా పీడీ మురళి, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం పాల్గొన్నారు.

# డా॥ వకుళాభరణంను అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

న్యూఢిల్లీ డిసెంబర్ 20 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ );కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చిన జిఎస్టి సంస్కరణల నేపథ్యంలో, సామాజిక న్యాయ దృష్టికోణంతో గ్రంథాన్ని రచించి ఇటీవల న్యూఢిల్లీలో ఆవిష్కరించిన సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ః అ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. శుక్రవారం నాడు న్యూఢిల్లీలోని జంతర్ మంతర్, రైసినా రోడ్‌లో గల అధికారిక నివాసంలో డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ఊు సంస్కరణలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి దార్శనిక దృష్టికి నిదర్శనం అని అన్నారు. అభివృద్ధి మరియు సామాజిక న్యాయ దృష్టితో డా. వకుళాభరణం రచించిన ఈ గ్రంథం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ పుస్తకం అనేక కోణాల్లో ఊు సంస్కరణల ఆకాంక్షను నిబద్ధతతో చర్చించిందని మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు కేవలం పన్ను తగ్గింపులకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలలో ఎంతగా ఉపయుక్తమో డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు లోతైన అధ్యయనంతో స్పష్టంగా విశ్లేషించి రచించారని మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారని డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు వివరించారు. అలాగే, ఇలాంటి రచనలు మరింతగా రావాల్సిన అవసరం ఎంతో ఉందని మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నట్లు డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు తెలిపారు.

# పల్స్ పోలియోపై అవగాహన



చిత్తూరు, డిసెంబర్ 20: చిత్తూరు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీని చిత్తూరు కార్పొరేషన్ మేయర్ కుమారి అముద జెండా ఊపి ప్రారంభించారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో నిండు జీవితానికి రెండే చుక్కలు, రేపే పల్స్ పోలియో, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో వేయించ ండి, అంగవైకల్యం నుంచి కాపాడుకోండి అనే నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ర్యాలీ ముగింపులో పాల్గొన్న వారందరితో పల్స్ పోలియోపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో పోలియో కేసులు జీరోగా ఉన్నప్పటికీ, చుట్టుపక్కల కొన్ని రాష్ట్రాల్లో పోలియో కేసులు కనిపిస్తున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ప్రతి ఏడాది డిసెంబర్ 21న రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్ తరాలను అంగవైకల్యం నుంచి కాపాడవచ్చని వివరించారు.

జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 69 పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల 2,21,502 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం 142 రూట్లలో 212 వాహనాలు, 1,415 పోలియో బూతులు, 5,800 మంది సిబ్బందిని నియమించి మొత్తం 2,94,600 పోలియో వ్యాక్సిన్ డోసులు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని సీడీపీవోలు, ఎంఈవోలు, వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. పోలియో బూత్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు సేవలందిస్తారని వివరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు బూత్‌లలో, రెండో మరియు మూడో రోజుల్లో ఇంటింటికి వెళ్లి ఎక్స్, వీ మార్కింగ్ చేస్తూ మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించి, పోలియో లేని సమాజాన్ని నిర్మిద్దామని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుడ చైర్మన్ శ్రీమతి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, వైద్యులు వెంకట ప్రసాద్, హనుమంతరావు, లోకేష్, ప్రవీణ్, గిరి, అనూష, ప్రోగ్రాం అధికారులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ

-ద్విచక్ర వాహనదారులతో ముఖాముఖి చర్చ
-హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించిన పోలీసులు
-ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ
-చట్టం కంటే ముందే ప్రాణభద్రతకు ప్రాధాన్యం



అమరావతి, డిసెంబర్ 20:విజయవాడ నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆలోచనల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షేక్ షరీన్ బేగం సూచనలతో, ట్రాఫిక్ సీఐ కే. కిషోర్ బాబు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధారణ ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 3వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ (ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి, ముత్యాలంపాడు రోడ్డులోని ఒక కళ్యాణ మండప సమావేశ మందిరానికి ఆహ్వానించారు. అక్కడ వాహనదారులతో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తూ హెల్మెట్ లేకుండా వాహనం నడపడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కొద్ది దూరమే ప్రయాణం చేస్తున్నామని, అసౌకర్యంగా ఉంటుందని, తొందరలో ఉన్నామని వంటి చిన్నచిన్న కారణాలతో హెల్మెట్ ధరించలేదని పలువురు వాహనదారులు తెలిపారు. అయితే ఇవి ప్రాణాల కంటే పెద్ద కారణాలు కాదని, ప్రమాదం ఎప్పుడు ఎక్కడ జరుగుతుందో ఎవరికీ తెలియదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ చర్చల అనంతరం వాహనదారులందరూ హెల్మెట్ ధారణ అత్యంత అవసరమని అంగీకరించారు.

ఇకపై తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతామని, తమ కుటుంబాల భద్రత కోసం ఈ నియమాన్ని కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. అలాగే తమతో పాటు ఇతర వాహనదారులకు కూడా హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రైటర్ అజహర్, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, జకీర్, బాలకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రధానాచార్యులు




హైదరాబాద్, డిసెంబర్ 20:ఉన్నత విద్యలో రాణిస్తూ నైపుణ్యాలను స్వంతం చేసుకున్న యువతకు అద్భుత అవకాశాలు ఉన్నాయని, ఆకాశమే హద్దుగా ఎదగడానికి ఇష్టపడి చదవాలని ప్రముఖ కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపల్ ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమలో దాగిన నైపుణ్యాలను గుర్తించి, వాటిని దినదినం మెరుగుపరుచుకుంటూ, ఆశించిన లక్ష్యాలను సాధిస్తూ, మన కన్న తల్లిదండ్రులు, విద్యాలయాలు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయ సంపన్నత సమాంతరంగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రపంచం మెచ్చిన బాల మేధావి శ్రీనివాస రామానుజన్ చూపిన గణిత ప్రతిభకు ప్రపంచ గణిత శాస్త్రవేత్తలు ప్రశంసలు కురిపించారని కొనియాడారు. చదువు ఎవరి సొంతం కాదని, చదువు నేర్చుకోవటానికి పేదరికం అడ్డు కాదని తెలిపారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రామనుజన్ జీవితాన్ని ప్రేరణగా తీసుకొని అందరూ కృషి చేయాలని అన్నారు. కోశాధికారి లయన్ పి సురేందర్ మాట్లాడుతూ నేడు చదువులపై శ్రద్ధ చూపిన వారు రేపటి సమాజానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి చేరుకుంటారని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలకు శాతవాహన లయన్స్ క్లబ్ వారు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులకు పాఠశాల యాజమాన్యం సన్మానించారు.

## కోల్‌కతా, సిలిగురి నగరాల మధ్య అత్యంత కీలకమైన అనుసంధాన మార్గాలుగా మారనున్న ఈ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:డిసెంబర్ 20వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. ఉదయం సుమారు 11:15 గంటలకు నదియా జిల్లాలోని రాణాఘాట్ లో జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

సుమారు రూ. 3,200 కోట్ల విలువైన రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవం చేయనున్నారు.నదియా జిల్లాలో ఎన్‌హెచ్ -34లోని 66.7 కిలోమీటర్ల పొడవైన బరజగులి - కృష్ణానగర్ సెక్షన్‌ను నాలుగు లైన్లుగా విస్తరించే పనులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. దీంతోపాటు ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఎన్‌హెచ్-34లోని 17.6 కిలోమీటర్ల పొడవైన బరాసత్-బరజగులి సెక్షన్‌ను నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసే పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

ఈ రెండు ప్రాజెక్టులు కోల్‌కతా, సిలిగురి మధ్య ఒక కీలకమైన అనుసంధాన వారధిగా పని చేయనున్నాయి. ఇవి ప్రయాణ సమయాన్ని సుమారు 2 గంటల వరకు తగ్గించేందుకు సహాయపడతాయి. తద్వారా ట్రాఫిక్ తగ్గి, వాహనాల రాకపోకలు వేగంగా, సులభంగా జరగనున్నాయి. వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా తగ్గనున్నాయి. కోల్‌కతాకు పశ్చిమ బెంగాల్‌లోని ఇతర జిల్లాలతో పాటు పొరుగు దేశాలతో కూడా అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి. ఈ ప్రాజెక్టులు స్థానికంగా ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడంతోపాటు ఆ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడనున్నాయి.

## గోవా విముక్తి దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్యయోధుల త్యాగాలను స్మరించుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: గోవా విముక్తి దినోత్సవం భారత జాతీయ ప్రయాణంలో ఓ ముఖ్య అధ్యాయాన్ని గుర్తుకు తీసుకువస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. అన్యాయాన్ని సహించక, ధైర్యంతోనూ దృఢ సంకల్పంతోనూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి అజేయ సాహసాన్ని ఆయన స్మరించుకున్నారు. గోవా సర్వతోముఖ అభివృద్ధికీ, దేశానికీ వారు చేసిన త్యాగాలు సదా స్ఫూర్తిని అందిస్తుంటాయని ప్రధానమంత్రి అన్నారు.

"గోవా విముక్తి దినోత్సవం మన జాతీయ ప్రయాణంలో ఓ ముఖ్య అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. అన్యాయాన్ని సహించక ధైర్యంతో, దృఢ సంకల్పంతో స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి అజేయ సాహసాన్ని మనం స్మరించుకుంటున్నాం. వారి త్యాగాలు.. గోవా సర్వతోముఖ అభివృద్ధి సాధనకు కృషి చేస్తున్న మనకు ఎప్పటికీ స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి" అని పేర్కొన్నారు.

# అస్సాంలో రూ. 15,600 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:డిసెంబర్ 20, 21 తేదీల్లో అస్సాం రాష్ట్రంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. డిసెంబర్ 20న మధ్యాహ్నం 3 గంటలకు ప్రధానమంత్రి గువాహటికి చేరుకుంటారు. అక్కడ లోకప్రియ గోపీనాథ్ బార్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

డిసెంబర్ 21న ఉదయం 9:45 గంటలకు గువాహటిలోని బొరాగావ్‌లో ఉన్న "స్వాహిద్ స్మారక క్షేత్రం" వద్ద అమరవీరులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులర్పిస్తారు. అనంతరం ఆయన దిబ్రూగఢ్ జిల్లాలోని నాంరూప్ ప్రాంతానికి వెళతారు.

అక్కడ అస్సాం వ్యాలీ ఫెర్టిలైజర్ అండ్ కెమికల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించనున్న అమోనియా-యూరియా ప్రాజెక్టుకు భూమిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జరిగే సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

డిసెంబర్ 20న గువాహటిలోని లోకప్రియ గోపీనాథ్ బార్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఇది అస్సాం రాష్ట్ర రవాణా వ్యవస్థ, ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ గుర్తింపులో ఒక విప్లవాత్మక ప్రస్థానంగా

ఈ కొత్త టెర్మినల్ భవనాన్ని సుమారు 1.4 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. ఇది ఏటా దాదాపు 1.3 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించగలదు. విమానాశ్రయంలో రన్‌వే, ఎయిర్‌ఫీల్డ్ వ్యవస్థలు, ఎప్రాన్ ప్రాంతాలు, టాక్సీవేలను భారీగా ఆధునీకరించారు.

దేశంలోని తొలి ప్రకృతి నేపథ్య విమానాశ్రయ టెర్మినల్‌గా ఈ విమానాశ్రయం ప్రత్యేకతను చాటుకుంటోంది. అస్సాం

జీవవైవిధ్యం, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా వెదురు పూల ఇతివృత్తంతో దీనిని రూపొందించారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి సేకరించిన సుమారు 140 మెట్రిక్ టన్నుల వెదురును దీని నిర్మాణంలో ఉపయోగించారు. కాజీరంగా జాతీయ

ఉద్యానవనాన్ని తలపించే వచ్చని ప్రకృతి దృశ్యాలు, సంప్రదాయ "జాపి" ఆకృతులు, ప్రసిద్ధ ఒంటికొమ్ము ఖడ్గమృగం చిహ్నాలు ఇక్కడ కొలువుదీరాయి. అస్సాం రాష్ట్ర పుష్పమైన "కోపౌ"ను పోలి ఉండేలా 57 ఆర్కిడ్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దాదాపు

లక్ష దేశీయ మొక్కలతో కూడిన ప్రత్యేకమైన 'స్కై ఫారెస్ట్'.. విమానాశ్రయానికి విచ్చేసే ప్రయాణికులకు అటవీ అనుభూతిని అందిస్తుంది.

ప్రయాణికుల సౌకర్యం, భద్రత కోసం అత్యున్నత డిజిటల్ ఆవిష్కరణలను ఈ టెర్మినల్ లో ప్రవేశపెట్టారు. వేగవంతమైన,

అంతరాయం లేని భద్రతా తనిఖీల కోసం ఫుల్-బాడీ స్కానర్లను ఏర్పాటు చేశారు. డిజియాత్రా సౌకర్యంతో కాంటాక్ట్‌లెస్ (స్పర్శ లేకుండా) ప్రయాణ సౌకర్యం. స్వయంచాలక సామాను నిర్వహణ వ్యవస్థ, ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్, కృత్రిమ మేధ ఆధారిత

విమానాశ్రయ కార్యకలాపాలు వంటి సౌకర్యాలు ప్రయాణికులకు అత్యంత సులభంగా, సురక్షితమైన, సమర్థవంతమైన ప్రయాణాలను అందిస్తాయి..

నాంరూప్ ప్రాంతానికి వెళ్లే ముందు డిసెంబర్ 21వ తేదీ ఉదయం స్వాహిద్ స్మారక క్షేత్రాన్ని సందర్శించి అస్సాం ఉద్యమ

అమరవీరులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులర్పిస్తారు. ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ ప్రజా ఉద్యమంలో.. విదేశీయులు లేని అస్సాంను నిర్మించడం, రాష్ట్ర అస్తిత్వాన్ని, సంస్కృతిని కాపాడుకోవడమే ప్రధాన ఉద్దేశ్యం.

మరుసటి రోజు దిబ్రూగఢ్ జిల్లా నాంరూప్‌లోని బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాంగణంలో కొత్త బ్రౌన్‌ఫీల్డ్ అమోనియా-యూరియా ఎరువుల ప్రాజెక్టుకు ప్రధాని భూమిపూజ చేస్తారు.

రైతుల సంక్షేమంపై ప్రధానమంత్రి దార్శనికతను ముందుకు తీసుకెళ్తూ.. రూ.10,600 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇది అస్సాంతో పాటు పొరుగున ఉన్న ఈశాన్య

రాష్ట్రాల ఎరువుల అవసరాలను కూడా తీరుస్తుంది. దీనివల్ల రైతులకు సకాలంలో, తక్కువ ధరకే ఎరువులు అందుబాటులోకి వస్తాయి. విదేశాల నుంచి ఎరువుల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. పారిశ్రామిక పునరుజ్జీవనానికి, రైతు సంక్షేమానికి ఈ ప్రాజెక్టు పునాదిగా నిలవనుంది.

# ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు

-ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.
-అందుకే రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా బుద్ధి చెబుతారు.
-నిర్మల్ జిల్లా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో
-బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు




నిర్మల్ డిసెంబర్ 20 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ );నిర్మల్ జిల్లా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ఘన విజయం సాధించిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఈ సందర్భంగా ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్. రాంచందర్ రావు గారు మాట్లాడుతూ..ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 181 గ్రామపంచాయతీలు ఉంటే, అందులో 103 గ్రామపం చాయతీల్లో బిజెపి అభ్యర్థులు సర్పంచులుగా గెలిచారు. అదే విధంగా నిర్మల్ జిల్లాలో 128 గ్రామపంచాయతీలు ఉంటే, దాదాపు 80కి పైగా గ్రామపంచాయతీల్లో బిజెపి సర్పంచులు విజయం సాధించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా 32 మంది బిజెపి సర్పంచులు గెలిచారు.పక్కనే ఉన్న నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ వంటి జిల్లాల్లో కూడా బిజెపి అభ్యర్థులు సర్పంచులుగా మంచి విజయాలు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1000 నుంచి 1200 మంది సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారినీ కాంగ్రెస్ గెలుపుగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే. గెలిచిన వారందరినీ తమవారిగా చెప్పుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఏమాత్రం న్యాయం జరగలేదు. ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. అందుకే రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా బుద్ధి చెబుతారు.తెలంగాణ వ్యాప్తంగా బిజెపి తరఫున సుమారు వెయ్యికి పైగా సర్పంచులు, 1200 మందికి పైగా ఉపసర్పంచులు, 10 వేల మందికి పైగా వార్డు సభ్యులు విజయం సాధించారు. గతంలో భారతీయ జనతా పార్టీకి కేవలం 163 మంది మాత్రమే సర్పంచులు ఉండగా, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో వెయ్యికి పైగా సర్పంచులుగా ప్రజలు తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు వ్యతిరేకంగా, ప్రధాని నరేంద్ర మోదీ గారి సుపరిపాలనకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు.ప్రధాని నరేంద్ర మోదీ గారు పేదల కోసం, గ్రామీణ ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తు న్నారు.వీధిదీపాలు, స్మశానవాటికలు, రైతు వేదికలు, పేదలకు ఉచిత బియ్యం, పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, ఉజ్వలా పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, యువతకు స్వయం ఉపాధి రుణాలు, ఉపాధి హామీ నిధులు, 14వ, 15వ ఆర్థిక సంఘాల నిధులను గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు నేరుగా అందించడం.. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వమే ఇస్తోంది.ఇంటింటికి తాగునీరు, పక్కా రోడ్లు, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, పీఎం-కిసాన్ సమ్మాన్ కింద ప్రతి రైతుకూ ఏటా రూ.6000- ఇలా అనేక రకాల సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది కేంద్ర ప్రభుత్వమే. ప్రస్తుతం తెలంగాణలో వేలకోట్లతో విలువైన రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోంది. గతంలో ఫైనాన్స్ కమిషన్ నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లించింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరుతున్నాను. లేకపోతే కాంగ్రెస్ పార్టీ కూడా నిధులను దారి మళ్లించే ప్రమాదం ఉంది.నిజామా బాద్-ఆదిలాబాద్ రైల్వే లైన్, నిర్మల్ రైల్వే స్టేషన్ వంటి అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమయ్యాయి.ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి అఖిలేష్ యాదవ్, కేటీ ఆర్, రేవంత్ రెడ్డిలను కలిశారు. వారిద్దరి మధ్య ఒప్పందం కుదర్చడానికే ఈ భేటీ జరిగింది. వికసిత్ భారత్ రోజ్ గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) పై కాంగ్రెస్ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోంది. మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం లేదు. ఇది పదే పదే చెబుతున్నా కాంగ్రెస్ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది.నేటి గ్రామీణ అవసరాలకు అనుగుణంగా మరింత పటిష్టంగా, విస్తృతంగా అమలు చేయడానికే వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ఎః-ఉ ఖీంఓ ఉ తీసుకొచ్చింది. ఇది ఉపాధిని మరింత పెంచడం. గతంలో 100 రోజుల ఉపాధి హామీ ఉంటే, ఇప్పుడు 125 రోజుల ఉపాధి హామీ కల్పించడం జరుగుతోంది.కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనలో ఉపాధి హామీకి సుమారు రూ.1.08 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత 11 ఏళ్లలోనే సుమారు రూ.8 లక్షల కోట్లకు పైగా కేటాయింపులు జరిగాయి. మహాత్మా గాంధీ గారిని బిజెపి ఎల్లప్పుడూ గౌరవిస్తుంది. గాంధీజీ పేరును కుటుంబ రాజకీయాలకు వాడుకున్నది సోనియా, రాహుల్ కుటుంబం, కాంగ్రెస్ పార్టీయే. ఎః-ఉ ఖీంఓ ఉ పథకంలో "రామ్" అనే పదం ఉందనే కారణంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయి.బిజెపి కార్యాలయాలపై దాడులు చేస్తే కాంగ్రెస్ ఎదుర్కోలేని ప్రతిస్పందన తప్పదని హెచ్చరిస్తున్నాం. రాజకీయాల్లో హింస ప్రజాస్వామ్యం కాదు. ఇటీవల స్థానిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రోద్బలంతో అధికార దుర్వినియోగం, పోలీసుల ఒత్తిడి, బెదిరింపులు జరిగాయి.రైతుబంధు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం, ఫసల్ బీమా యోజనను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. కానీ మోదీ ప్రభుత్వం పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా మద్దతు ఇస్తోంది.గత 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రాన్ని దోచుకునే రాజకీయాలే చేశాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రంలో దోచుకున్న సొమ్మును ఎలా పంచుకోవాలో చూస్తుంటే, మరొకరు అదే దోపిడి సొమ్మును ఎలా పంచుకోవాలో చూస్తున్నారు.తెలంగాణ నిజంగా బంగారు తెలంగాణ కావాలంటే, అభివృద్ధి మార్గంలో ముందుకెళ్లాలంటే బీజెపి మాత్రమే ప్రత్యామ్నాయం. రానున్న అన్ని ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని కోరుతున్నాను.

# పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం : చీఫ్ విప్ జీవీ



అమరావతి, డిసెంబర్ 20: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ. ఆంజనేయులు అన్నారు. శనివారం శావల్యాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు.

అనంతరం పారిశుద్ధ్య నిర్వహణ కోసం కేటాయించిన ఎలక్ట్రానిక్ వాహనాలు మరియు రిక్షాలను జెండా ఊపి ప్రారంభించి, కార్మికులకు అందజేశారు. గ్రామాల్లో అహర్నిశలు కష్టపడుతూ, ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..



ఆదిలాబాద్, డిసెంబర్ 20: ఊట్కూర్ పట్టణ ప్రజలు ఎంతో అభిమానంతో ఓట్లు వేసి గెలిపించా రని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తానని ఊట్కూరు సర్పంచ్ ఏం. రేణుక భరత్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని పాతపేట వీధిలో బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ ఆధ్వర్యంలో నూతనంగా గెలుపొందిన ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా ఆవెం మాట్లాడుతూ అతి చిన్న వయసులో ఊట్కూర్ ప్రజలు ఆదరించి గెలిపించారని, కేంద్ర ప్రభుత్వ ఎంపీ నిధులతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చి ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, యువతకు ప్రజలు పట్టం కట్టారని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయడంతో పాటు పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు.

ఊట్కూర్ మండల కేంద్రంలోని 16 వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్.రమేష్, వార్డు సభ్యులు సువర్ణరవి, అక్షయ్ కుమార్, కలాల్ అశోక్ గౌడ్, బీజేపీ నాయకులు కృష్ణయ్య గౌడ్, రమేష్, లక్ష్మణ్, ఆశప్ప, హన్మంతు, రమేష్, మాజీ వార్డు సభ్యురాలు లక్ష్మీతిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు 11 మంది ఎంపిక

వరంగల్,డిసెంబర్ 20: తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-14 ఇయర్స్ బాక్సింగ్ బాలుర టోర్నమెంట్ కం సెలక్షన్స్ పూర్తయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడురోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 111 మంది క్రీడాకారులు పాల్గొనగా 11 మంది ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ వి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ఈనెల 26 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్ గుణాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యంగా ఉండడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పుట్ట మోహన్‌రెడ్డి, అబ్జర్వర్ కే.ఉప్పలయ్య, స్విమ్మింగ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంచాల స్వామిచరణ్, బాక్సింగ్ కన్వీనర్, టిజిపేట అధ్యక్షుడు శీలం పార్థసారధి, భూపాలపల్లి డీవైఎస్వో సీహెచ్. రఘు, రిటైర్డ్‌ఆర్మీ, ఎన్ఐఎస్ డిప్లొమా కోచ్ నరేందర్ దేవ్, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ పి.నర్సింలు, ఇంటర్నేషనల్ బాక్సర్ అవినాష్, బి.లింగమూర్తి, బి.సతీష్, హెచ్.కుమారస్వామి, కోచ్‌లు హెచ్. శ్రీకాంత్, ఎస్.సాంసన్, ప్రభు, రాజు, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

# మండల స్థాయి గణిత టాలెంట్ పరీక్ష..



మంచిర్యాల, డిసెంబర్ 20:తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఈ రోజు మండల స్థాయిలోని అన్ని ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో మామిడిపల్లి విద్యార్థిని అర్చన ప్రథమ స్థానం, జశ్విత్ దండేపల్లి విద్యార్థి రెండో స్థానం సాధించారు.

మూడో స్థానంలో మామిడిపల్లి విద్యార్థి సాత్విక నిలిచారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రాధనోపాధ్యాయులు రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్ష నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వీరు ఈనెల 30న జిల్లా స్థాయిలో జరిగే ప్రతిభా పరీక్షకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో పోదాం మండల అధ్యక్షుడు ఏనుగుల రమేష్, కార్యదర్శులు తనుగుల రాజమౌళి, చెట్టుపల్లి రమేష్ , గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'పని హక్కుపై బీజేపీ ప్రభుత్వ దాడిని ఖండించండి'

## -ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసే మోదీ చర్యలను వ్యతిరేకించండి

## - సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపు




నల్గొండ, డిసెంబర్ 20:: ప్రధాని మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను రద్దు చేసి జి రాం జి 2025 పేరుతో 197 బిల్లును తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని, పని హక్కుపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడిని ప్రతి వ్యక్తి ఖండించాలని సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎం నల్లగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర వికసిత్ భారత్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (గ్రామీణ) 2025 బిల్లు రద్దు చేయాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చేయబోతున్నారో మోదీ ప్రభుత్వం దగ్గర స్పష్టత లేదని విమర్శించారు. ఈ కొత్త బిల్లు ఉన్న ఉపాధిని లేకుండా చేస్తున్నదన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల మునుగు తగిలించారని విమర్శించారు.

ఉపాధి హామీ పనులు ఫిబ్రవరి 20 నుండి జూన్ 20 వరకు 75 శాతానికి పైగా జరుగుతాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయంటే వ్యవసాయ పనులు పెద్దగా లేని సమయంలో రైతులకు ఎంఎస్‌పీ, పంట పెట్టుబడి నుండి తప్పించుకోవటానికే కదా అన్నారు. ఇప్పటి వరకు 90 శాతం ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా ఉండేదని ఇప్పుడు 40 శాతం వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పడం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ఎత్తివేయాలనే కుట్రలో భాగంగానే రాష్ట్రాలపై భారం వేయ్యటం అన్నారు. పనులను 4 రకాలుగా విభజించి కోట్ల రూపాయల పనులను చేర్చారని అంటే యంత్రాలు, కాంట్రాక్టర్లకు ఉపాధి హామీగా మార్చటమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేశారని విమర్శించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని ఉన్న నిబంధన ఇప్పుడు తొలిగించారని అన్నారు. ఆధార్ నిబంధన కచ్చితంగా అమలు చేయడం లేదని సుప్రీం కోర్టుకు స్పష్టం చేసి ఇప్పటికే ఉపాధికి ఆధార్ లింక్, కొలతలతో వేతనాలు ఇస్తూ రెండు పూటల హాజరు, కేవైసీ చట్ట విరుద్ధంగా పెట్టారని ఆందోళనకు చేస్తుంటే ఇప్పుడు బయోమెట్రిక్, ఏఐ, జీపీఎస్ ను చట్టబద్ధం చేయ్యటం కంటే పేదలను ఉపాధి హామీ నుండి తొలగించడం తప్పా మరొకటి కాదని విమర్శించారు.

ఇప్పటి వరకూ పంచాయతీలు ప్రధాన పాత్ర ఉన్నదని ఇప్పుడు అన్ని అధికారాలు కేంద్రంకు ఉంటాయని, చివరకు సోషల్ ఆడిట్ కూడా మనుషులు కాకుండా టెక్నాలజీతో చేస్తామని ప్రభుత్వం చెబుతుందని దీని వలన ఉపయోగం ఎవరికి ఉంటుందని అడిగారు. ఉపాధి హామీ నిధులతో ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఇస్తున్న భూముల అభివృద్ధి, కాలనీల అభివృద్ధి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఉపాధి నిధులు మంజూరు చేస్తూ పనులు చేపట్టడం జరిగిందని ఇప్పుడు వాటి ప్రస్తావనే లేకుండా పోయిందని, ఇలాంటి అనేక అంశాలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కొత్త బిల్లు ఉపాధిని హరించే దిగా కొద్ది మేరకు ఉన్న ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోతవని, అందుకే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టమే ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకు విస్తరించి మరింత పటిష్టంగా అమలు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, అద్దంకి నరసింహ, ఊట్కూరి మధుసూదన్ రెడ్డి, ఎండి సర్దార్ అలీ, ఉడుగుండ్ల రామకృష్ణ, గంజి రాజేష్, విష్ణుమూర్తి, అనురాధ, వెంకటయ్య పాల్గొన్నారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్

హైదరాబాద్, డిసెంబర్ 20: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతని బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా చందానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులతో కలిసి శనివారం మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆవెం మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలన్నారు.

ప్రభుత్వంతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కోఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్, ప్రసాద్, శ్రీకాంత్, మల్లారెడ్డి , సంగారెడ్డి, నగేష్ రెడ్డి, రాజు, సునీత, అనంత రెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# అలిపిరి చెక్ పోస్ట్ వద్ద సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం టీటీడీకి రూ.38 లక్షలు విరాళం




తిరుపతి, డిసెంబర్ 20:అలిపిరి చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం ఇండియన్ బ్యాంక్ రూ.37,97,508 టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ మేనేజర్ ప్రణేశ్ కుమార్ విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘువేంద్ర పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.31 కోట్లు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.31 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,729 మంది భక్తులు దర్శించుకోగా 22,162 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేత

కారేపల్లి, డిసెంబర్ 20 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి గ్రామానికి చెందిన, వైరా ఎస్ఐ పుష్పాల రామారావు, కుటుంబ సభ్యులు తమ తల్లిదండ్రులు దివంగత పుష్పాల జగన్నాథం, ఇందిరమ్మల జ్ఞాపకార్థం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం యూనిఫామ్‌లు ఉచితంగా అందించారు. మొత్తం 70 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ నవీన జ్యోతి తమ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్ లు కావాలని విజ్ఞప్తి చేయగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనేక సేవా కార్యక్రమాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించనట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భముగా తాము అడిగిన వెంటనే యూనిఫామ్‌లు అందించిన ఎస్ఐకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

# బూర్గుల రామకృష్ణారావు, పొట్టి శ్రీరాములు ఎప్పుడూ తన గుండెల్లో ఉంటారు

## -ఎపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బూర్గుల రామకృష్ణారావు, పొట్టి శ్రీరాములు ఎప్పుడూ తన గుండెల్లో ఉంటారని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. గతంలో పొట్టి శ్రీరాములను వైశ్య కులానికి పరిమితం చేశారని, పొట్టి శ్రీరాములు గొప్పదనాన్ని నెల్లూరు జిల్లాకే పరిమితం చేశారని అన్నారు. వందల కులాల కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. నిడదవోలు మండలం పెరవలిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. అమరజీవి జలధార పథకానికి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు వివరాలను పవన్ కల్యాణ్ కు అధికారులు వివరించారు. నిడదవోలు సభలో పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు వైసిపికి భయపడలేదని, అధికారంలోకి వస్తే చంపేస్తామని బెదిరించారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మీ బెదిరింపులకు భయపడలేదని, బాధ్యత మరిచి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మళ్లీ తామే వస్తే ఒక్కొక్కరిని చంపేస్తామని అంటున్నారని, కాంట్రాక్టర్లను జైళ్లలో పెడతామని బెదిరిస్తున్నారని, ధ్వజమెత్తారు. బెదిరించే నాయకులకు పవన్ భయపడడని సూచించారు. అమ్ముకున్నానని తనను విమర్శించారని అన్నారు. ప్రజలకోసం సీట్లు తగ్గించుకున్నానని, తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన బూర్గుల, పొట్టి శ్రీరాములు తనకు స్ఫూర్తి అని స్పష్టం చేశారు. తెలుగుజాతి, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం ఏకమయ్యామని, విభిన్న పార్టీల భావజాలం నుంచి వచ్చి ఒక్కటయ్యామని తెలియజేశారు. ఒకే కుటుంబం కోసం అందరం ఆలోచించామని, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు 5 జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్ల ఖర్చు చేశామని అన్నారు. ప్రాజెక్టు ద్వారా 1.20 కోట్ల మంది దాహార్తి తీర్చాలన్నదే లక్ష్యమని, ఎక్కువ తీర ప్రాంతాలు కలిపే లక్ష్యంతో ప్రాజెక్టు రూపకల్పన చేశామని చెప్పారు. 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో సాగుతున్నామని పవన్ పేర్కొన్నారు. తెలుగువారికి ఉనికి ఇచ్చిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని.. ప్రాణత్యాగం చేసిన వ్యక్తి చనిపోయాక తీసుకెళ్లేందుకు ఎవరూ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఘంటసాల ముందుకు వచ్చి పొట్టి శ్రీరాములు మృతదేహాన్ని ఖననం చేశారని, తెలుగుజాతి, ఆత్మగౌరవం అని మాట్లాడేందుకు మూల కారకుడు పొట్టి శ్రీరాములు అని ప్రశంసించారు. నాయకులకు కులాలు అంటగడితే.. కులాల సమూహంలానే ఉంటామని, భారతీయులుగా ఉండలేమని అన్నారని తెలిపారు. పవన్ కల్యాణ్ సభలో పెద్ద ఎత్తున అభిమానులు కేరింతలు కొట్టారు.

# విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి : ఎంఈఓ అంబటి అంజయ్య

నల్గొండ, డిసెంబర్ 20: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని కట్టంగూర్ ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. శనివారం కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన స్టాల్స్‌ను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మావతితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. జంక్ ఫుడ్ తినడం వల్ల విద్యార్థుల్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయో తెలుసుకునేందుకు పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందన్నారు.

ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై విద్యాపరంగా తమ పిల్లల ప్రగతి తెలుసుకోవాలన్నారు. పాఠశాలలో సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే తల్లిదండ్రులు వారిని చదివించాలని సూచించారు.

# 'ఎస్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలతో పేదల కండ్లలో ఆనందం'



సూర్యాపేట, డిసెంబర్ 20 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సతీమణి, ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గుంటకండ్ల సునీత, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ జన్మదిన వేడుకలను సూర్యాపేట పట్టణంలోని తొమ్మిదవ వార్డు బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు గుండగాని నాగభూషణం మాట్లాడుతూ.. ఎస్ ఫౌండేషన్ ద్వారా గుంటకండ్ల సునీత చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతోమంది పేదల కండ్లల్లో ఆనందం నింపుతున్నట్లు తెలిపారు.

అలాగే సూర్యాపేట పట్టణానికి ఐదేళ్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పని చేసిన పెరుమాళ్ల అన్నపూర్ణ పట్టణంలో శివారు కాలనీలను అభివృద్ధి చేయడంతో పాటు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మచ్చ రాము, షేక్ అన్వర్ పాషా, కట్ల మురళి, బొడ్డు దుర్గయ్య, కొచ్చర్ల వీరేశ్, అనుములపూరి శాంతి కుమార్, అనుములపూరి నవీన్, పోతురాజు తిరుమల్, మహిళా నాయకురాలు బండవీది రజిత, మారుపాక ఉప్పలమ్మ, షేక్ భాను పాల్గొన్నారు.

